
# 40 మంది నక్సల్స్ మృతి!

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- మృతుల్లో అగ్రనేత శంకర్‌రావు
- భారీగా ఆయుధాలు స్వాధీనం
- ముగ్గురు జవాన్లకు గాయాలు
- రాష్ట్రంలో ఇదే అతిపెద్ద ఆపరేషన్!
- బస్తర్‌లో గత మూడున్నర నెలల్లో 79 మంది మావోయిస్టుల మృతి



శంకర్‌రావు (ఫైల్)

హైదరాబాద్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ)/కొత్తగూడెం క్రైం/కాంకేర్: ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. నక్సల్స్ ప్రభావిత బస్తర్ రీజియన్‌లోని కాంకేర్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర ఎదురు కాల్పుల్లో దాదాపు 40 మంది మావోయిస్టులు మృతిచెందినట్టు అనధికారిక వర్గాలు తెలిపాయి. ఇప్పటికే 29 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని అధికారులు ధ్రువీకరించారు. ఈ సంఖ్య మరింత పెరుగొచ్చని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో జరిగిన అతి పెద్ద ఎన్‌కౌంటర్ ఇదేనని పోలీసులు చెబుతున్నారు. మృతుల్లో మావోయిస్టు అగ్రనేత తెలంగాణలోని భూపాలపల్లి జయశంకర్ జిల్లాకు చెందిన శంకర్‌రావు కూడా ఉన్నారని పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఆయనపై రూ.25 లక్షల రివార్డు ఉన్నది. ఎన్‌కౌంటర్ ఘటనాస్థలి నుంచి భారీ యెత్తున ఏకే-47లు, ఎస్‌ఎల్‌ఆర్, ఇన్సాస్ రైఫిళ్లు, కార్బైన్, 303 రైపిల్స్, ఇతర ఆయుధ సామగ్రిని స్వాధీనం చేసుకొన్నారు. ఈ ఘటనలో బీఎస్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సహా ఇద్దరు జవాన్లకు కూడా గాయాలయ్యాయి. వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నదని, చికిత్స కోసం దవాఖానకు తరలించినట్టు బస్తర్ రేంజ్ ఐజీపీ పీ సుందర్‌రాజ్ పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్ ఘటనను నక్సలిజంపై సర్జికల్ స్ట్రైక్‌గా ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్ శర్మ అభివర్ణించారు.

**పక్కా సమాచారంతో సెర్చ్ ఆపరేషన్**

ఎన్‌కౌంటర్ ఘటనకు సంబంధించిన వివరాలను బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. కాంకేర్ జిల్లాలో మావోయిస్టులు భారీ ప్లీనరీకి సమాయత్తమవుతున్నట్లు పోలీస్ అధికారులకు సమాచారం అందింది. సీపీఐ(మావోయిస్టు) బస్తర్ డివిజన్ నేతలు శంకర్, లలిత, రాజు తదితరులు హాజరవుతున్నారని తెలిసింది. దీంతో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్‌ఎఫ్), జిల్లా రిజర్వు గార్డు(డీఆర్‌జీ), రాష్ట్ర పోలీసులు, ఇతర భద్రతా దళాలు సంయుక్తంగా చోటేబేథియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో యాంటీ మావోయిస్టు ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో బీనగుండా-కొరగుట్ట అటవీ ప్రాంతంలో భారీ సంఖ్యలో సాయుధ మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి ఒక్కసారిగా కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు ఎదురు కాల్పులకు దిగి, మావోయిస్టులను చంపేశారు. ఘటనాస్థలంలో మావోయిస్టుల మృతదేహాలతోపాటుగా భారీయెత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకొన్నారు.



ఛత్తీస్‌గఢ్ కాంకేర్ జిల్లాలో నక్సల్స్‌తో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గాయపడ్డ జవాను

**ఎగువ ప్రాంతం నుంచి కాల్పులు**

మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎన్‌కౌంటర్ ప్రారంభమైనట్టు సమాచారం. భద్రతా బలగాలు ఎత్తైన ప్రాంతం నుంచి కాల్పులు చేయడంతో కింది ప్రదేశంలో ఉన్న మావోయిస్టులు తప్పించుకొనేందుకు అవకాశం లేకుండా పోయిందని తెలిసింది. రెండు వర్గాల మధ్య సుమారు 4 గంటలపాటు ఎదురు కాల్పులు జరిగినట్టు తెలుస్తున్నది. కాల్పుల అనంతరం మావోయిస్టులు పారిపోయిన తర్వాత భద్రతా దళాలు ఘటనాస్థలాన్ని చుట్టుముట్టి గాలింపు చర్యలు చేపట్టాయి.

**ఏజెన్సీ ప్రాంతాల్లో రెడ్ అలర్ట్**

ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టుల్లో డివిజన్ కమిటీ సభ్యులు నలుగురు ఉన్నట్లు తెలుస్తున్నది. ఇందులో ఒకరు తెలంగాణలోని భూపాలపల్లి జయశంకర్ జిల్లా చిట్యాల మండలం చల్లగరిగె గ్రామానికి చెందిన శంకర్‌రావు అలియాస్ మురళి అలియాస్ శ్రీపల్లి సుధాకర్ కాగా.. మరొకరు బీజాపూర్ జిల్లా భామర్‌గఢ్ ప్రాంతానికి చెందిన లలితగా గుర్తించినట్లు సమాచారం. అయితే ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టు ముఖ్య నేతలు మృతిచెందినట్లు వస్తున్న వార్తలపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. తాజా ఘటన నేపథ్యంలో పోలీస్ అధికారులు ఛత్తీస్‌గఢ్ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను అప్రమత్తం చేశారు.

**కాంకేర్‌లో 26న లోక్‌సభ ఎన్నికలు**

ఈనెల 19 నుంచి లోక్‌సభ ఎన్నికల మొదటి దశ ప్రారంభం కానున్న నేపథ్యంలో తాజా ఎన్‌కౌంటర్ ప్రాధాన్యం సంతరించుకొన్నది. మావోయిస్టు ప్రభావిత బస్తర్ లోక్‌సభ నియోజకవర్గంలో తొలి దశ ఎన్నికల్లో భాగంగా 19న పోలింగ్ జరుగుతుంది. అదేవిధంగా తాజా ఎన్‌కౌంటర్ జరిగిన కాంకేర్ లోక్‌సభ స్థానానికి రెండో దశ పోలింగ్‌లో భాగంగా ఈనెల 26న ఎన్నికలు జరుగుతాయి. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఏ ఎన్నిక అయినా ఓటింగ్ శాతం తక్కువ ఉంటున్నది.

**వరుస ఎన్‌కౌంటర్లలో పదుల మరణాలు**

ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య జరుగుతున్న పోరులో పదుల సంఖ్యలో మావోయిస్టులు మరణిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత బస్తర్ రీజియన్‌లో ఈ ఏడాది ఇప్పటి వరకు నాలుగు నెలల వ్యవధిలో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 79 మంది మావోయిస్టులు మరణించారని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ నెల 2న బీజాపూర్ జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 13 మంది నక్సలైట్లు మృతిచెందారు.

**ఐదేండ్లలో అతిపెద్ద ఎన్‌కౌంటర్ ఇదే!**

గత ఐదేండ్లలో జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇదే అతిపెద్దదిగా తెలుస్తున్నది. 2018 ఆగస్టులో ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో 15 మంది మావోయిస్టులు చనిపోయారు. అదే ఏడాది మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా రేల్-కస్నాసుర్ అడవుల్లో జరిగిన ఎదురు కాల్పుల్లో సుమారు 40 మంది మావోయిస్టులు మరణించారు. మళ్లీ 2021 నవంబర్‌లో గడ్చిరోలిలో జరిగిన యాంటీ మావోయిస్టు ఆపరేషన్‌లో భాగంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో 26 మంది మావోయిస్టులు మృతిచెందారు. 2016లో 30 మంది నక్సలైట్లను గ్రేహౌండ్స్ బలగాలు చంపేశాయి.

**నక్సలిజం అతిపెద్ద శత్రువు: అమిత్‌షా**

ఛత్తీస్‌గఢ్ తాజా ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పందించారు. ఆపరేషన్ విజయవంతంగా సాగిందని పేర్కొన్న ఆయన.. భద్రతా సిబ్బంది ధైర్య సాహసాలను ప్రశంసించారు. దేశాభివృద్ధి, శాంతి భద్రతలు, యువత ఉజ్వల భవిష్యత్తుకు నక్సలిజం అతి పెద్ద శత్రువు అని అన్నారు. దేశానికి నక్సలిజం నుంచి విముక్తి కల్పించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. కాల్పుల్లో గాయపడిన భద్రతా సిబ్బంది కోలుకోవాలని అమిత్‌షా ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు.

### నక్సల్స్ జాడ చెబితే ఉద్యోగం, 5 లక్షల నగదు

**ఛత్తీస్‌గఢ్ పోలీసుల ఆఫర్**

రాయ్‌పూర్, ఏప్రిల్ 16: నక్సలైట్ల జాడ గురించి కచ్చితమైన సమాచారమిచ్చిన వారికి ఛత్తీస్‌గఢ్ పోలీసులు బంపర్ ఆఫర్ ప్రకటించారు. సరైన సమాచారం ఇచ్చిన వారికి పోలీస్ శాఖలో ఉద్యోగాలిస్తామని, రూ.5 లక్షల నగదు పారితోషికం కూడా ఇస్తామని కబీర్ధామ్ జిల్లా సీనియర్ అధికారి తెలిపారు. మధ్యప్రదేశ్ సరిహద్దులోని జిల్లాల్లోని నక్సలైట్ ప్రభావిత గ్రామాల్లో ఈ మేరకు కరపత్రాలను పంపిణీ చేశారు. వాటిలో 'సుచ్నా దో ఇనామ్ పావో' (సమాచారం ఇవ్వండి, బహుమతిని అందుకోండి) అని ప్రకటించారు. అలాగే లొంగిపోవటానికి సిద్ధపడిన నక్సలైట్లకు కూడా నగదు రివార్డులను ఇస్తామని కరపత్రాల్లో పేర్కొన్నారు. కేవలం కరపత్రాలే కాకుండా ఆ ప్రాంతంలోని మొబైల్ వినియోగదారులందరికీ వాట్సాప్ ద్వారా కూడా సందేశాన్ని పంపినట్టు కబీర్‌దామ్ ఎస్పీ అభిషేక్ పల్లవ్ తెలిపారు. తాము అందించే నగదు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రకటించిన బహుమతికి అదనమని ఆయన స్పష్టం చేశారు. ఇక సమాచారమిచ్చి వారికి ఎలాంటి పరీక్షలు లేకుండా పోలీసు శాఖలో కానిస్టేబుల్స్‌గా తీసుకుంటామని, కాకపోతే శారీరక ప్రమాణాలను మాత్రం పాటించాల్సి ఉంటుందన్నారు.

### ఆపరేషన్‌కు ఎస్పీ ఇంద్ర కల్యాణ్ నాయకత్వం

తాజా ఎన్‌కౌంటర్‌కు కాంకేర్ జిల్లా ఎస్పీ ఇంద్ర కల్యాణ్ ఎలీషా నాయకత్వం వహించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు మావోయిస్టులు భారీ విధ్వంసానికి కుట్ర పన్నారనే సమాచారం భద్రతా దళాలకు నిఘా వర్గాలు అందించాయని ఆయన తెలిపారు. అడవుల్లో వంద మందికిపైగా మావోయిస్టులు ఏర్పాటు చేసుకొన్న క్యాంపును భద్రతా బలగాలు గుర్తించి, సోమవారం సాయంత్రం ఆపరేషన్ ప్రారంభించాయని పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం కొండపైకి చేరుకొని కాల్పులు మొదలు పెట్టాయని వివరించారు.

### అందాల పోటీలో ఏఐ భామలు

**ఏప్రిల్ 21 నుంచి దరఖాస్తులు**
**మే 10న మిస్ ఏఐ విజేత ప్రకటన**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: అందుగలదని, ఇందుగలదని సందేహం వలదు.. ఎందెందు వెతికినా అందందే కలదు అని ఇప్పుడు కొత్తగా ఏఐ గురించి చెప్పుకోవాలి. కృత్రిమ మేధ ప్రవేశించని రంగమే లేదు. తాజాగా ఏఐ సృష్టించిన భామల మధ్య అందాల పోటీలు కూడా జరగబోతున్నాయని వరల్డ్ ఏఐ క్రియేటర్ అవార్డ్స్ వెల్లడించినట్టు మీడియాలో కథనాలు వచ్చాయి. మిస్ ఏఐ పోటీలో నెగ్గిన విజేతకు 20 వేల డాలర్ల ప్రైజ్ మనీ కూడా ఇవ్వనున్నారు. ఈ భామల లుక్స్‌తో పాటు వీటి తయారీకి ఉపయోగించిన టెక్నాలజీ, సోషల్ మీడియాలో వీటి ప్రభావం తదితర అంశాలన్నీ విజేత ఎంపికలో పరిగణనలోకి తీసుకోబోతున్నారు. ఈ పోటీల కోసం ఏప్రిల్ 21 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. మే 10న విజేతలను ప్రకటించనున్నారు.

### లైక్ కొట్టాలంటే ఫీజు కట్టాల్సిందే

**'ఎక్స్' కొత్త యూజర్లకు షాక్**

శాన్‌ఫ్రాన్సిస్కో, ఏప్రిల్ 16: ప్రముఖ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' కొత్త యూజర్లకు షాక్ ఇచ్చింది. ఫేక్ ఖాతాలు, స్పామ్‌ను అడ్డుకునే ప్రయత్నం పేరుతో కొత్త ఖాతాదార్లకు వార్షిక ఫీజు విధించబోతున్నట్టు 'ఎక్స్' కంపెనీ (ఎక్స్ కార్ప్) నుంచి మంగళవారం ప్రకటన వెలువడింది. కొత్త ఖాతాలకు ప్రతి ఏటా కొద్ది మొత్తంలో 'వార్షిక ఫీజు' వసూలు చేయబోతున్నట్టు కంపెనీ తెలిపింది. కొద్ది మొత్తాన్ని ఫీజుగా చెల్లించాకే.. కొత్త యూజర్లు 'ఎక్స్'లో పోస్ట్, లైక్, బుక్‌మార్క్, ప్రత్యుత్తరం ఇచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రస్తుతం న్యూజిలాండ్‌లో ఈ విధానాన్ని 'ఎక్స్' అమలు జేస్తున్నది. ఇక్కడ కొత్త యూజర్ల నుంచి వార్షిక ఫీజుగా ఒక అమెరికా డాలర్‌ను వసూలు చేస్తున్నది. 'స్పామ్ ఖాతాలను తగ్గించడానికి, ప్రతి వినియోగదారుకు మెరుగైన సేవలు అందించేందుకు ఉపయోగపడుతుంది' అని కంపెనీ వెబ్‌సైట్ పేర్కొన్నది.

## రాత్రిళ్లు విచారణ ఎందుకు?

**ఇది నిద్రించే హక్కును ఉల్లంఘించడమే**
**ఈడీ తీరుపై బాంబే హైకోర్టు అసహనం**



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): నిద్ర మనుషుల ప్రాథమిక అవసరమని బాంబే హైకోర్టు తెలిపింది. విచారణ పేరిట రాత్రిళ్లు వేధించడం సరైన పద్ధతి కాదని, ఇది మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని పేర్కొంది. ఓ కేసు విచారణ సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఈ మేరకు హితవు పలికింది. మనీ లాండరింగ్ కేసులో భాగంగా కిందటేడాది రామ్ కోటుమల్ ఇస్రానీ అనే 64 ఏండ్ల వ్యక్తిని ఈడీ అరెస్టు చేసింది. అరెస్టును సవాల్ చేస్తూ ఇస్రానీ న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. గత ఆగస్టు 7న తనను రాత్రంతా విచారించిన ఈడీ.. ఆ మర్నాడు తెల్లవారుజామున అరెస్టు చేసినట్టు పేర్కొన్నాడు. దీన్ని పరిశీలించిన ధర్మాసనం ఇస్రానీ పిటిషన్‌ను కొట్టేసింది. అయితే, అతడిని రాత్రిళ్లు ఈడీ విచారించడాన్ని మాత్రం తప్పుబట్టింది. దీంతో పిటిషనర్ అనుమతి తీసుకొన్నాకనే రాత్రి విచారణ చేసినట్టు ఈడీ కోర్టుకు తెలిపింది. దీనిపై స్పందించిన కోర్టు.. నిందితుడి అంగీకారం ఉన్నప్పటికీ రాత్రిళ్లు విచారణ చేపట్టడం సరైనది కాదని తేల్చిచెప్పింది. ఇది ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతుందన్న ధర్మాసనం.. పగటిపూట మాత్రమే వాంగ్మూలాలను రికార్డు చేయాలని సూచించింది.

## బహిరంగంగా క్షమాపణలు చెప్పండి!

**రాందేవ్, బాలకృష్ణలకు సుప్రీం ఆదేశం.. మీరేం అమాయకులు కాదంటూ వ్యాఖ్య**

*న్యూఢిల్లీ: తప్పుదోవ పట్టించే ప్రకటనల విషయంలో వారం రోజుల్లోగా బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని పతంజలి వ్యవస్థాపకులు రాందేవ్ బాబా, బాలకృష్ణలను సుప్రీంకోర్టు ఆదేశించింది. గత ఉత్తర్వుల్లో కోర్టు ఏం చెప్పిందో తెలుసుకోలేనంత అమాయకులేం కాదు మీరు అని వారిపై మండిపడింది. మీ తప్పును ఒప్పుకుంటూ వారం రోజుల్లోగా బహిరంగ క్షమాపణలు చెప్పి తీరాల్సిందేనని నిర్దేశించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలో కేసులో మంగళవారం సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఈ విచారణకు రాందేవ్ బాబాతోపాటు బాలకృష్ణ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరిద్దరూ కలిసి మరోసారి కోర్టులో బేషరతుగా క్షమాపణలు చెప్పారు. కేసు తదుపరి విచారణను కోర్టు ఏప్రిల్ 23వ తేదీకి వాయిదా వేసింది.*

## తమిళనాట త్రిముఖ పోరు

- మరోసారి సత్తా చాటాలని డీఎంకే కూటమి వ్యూహాలు
- బీజేపీని వదిలి కొత్త కూటమి కట్టిన అన్నా డీఎంకే
- చిన్న పార్టీలను కూడగట్టి బరిలోకి దిగుతున్న బీజేపీ




చెన్నై, ఏప్రిల్ 16: ఎన్నిక ఏదైనా విలక్షణ తీర్పు ఇవ్వడం తమిళుల ప్రత్యేకత. ఈ ఎన్నికల్లో ఒకే పార్టీకి ఏకపక్షంగా పట్టం కట్టే ఓటర్లు తర్వాతి ఎన్నికల్లో అదే పార్టీని దారుణంగా ఓడించి మరో పార్టీకి గంపగుత్తాగా సీట్లన్నీ అప్పగిస్తారు. జాతీయ పార్టీలను ఆమడదూరంలో పెట్టే తమిళనాడులో కొన్ని దశాబ్దాలుగా ద్రావిడవాద పార్టీల మధ్యనే పోరు నడిచింది. లోకల్ ఎలక్షన్లైనా, లోక్‌సభ ఎలక్షన్లైనా డీఎంకే, అన్నా డీఎంకే పార్టీల మధ్యే పోటీ ఉండేది. తమిళ నేలపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు డీఎంకే, అన్నా డీఎంకే పార్టీల వేలు పట్టుకొని నడుస్తూ వచ్చాయి. సినీ రాజకీయాలకు పెట్టింది పేరైన తమిళనాట ఈసారి మాత్రం రాజకీయ సినిమా మారిపోయింది. ఎప్పుడూ ద్విముఖ పోటీనే ఉండే రాష్ట్రంలో ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొంది. గత ఎన్నికల్లో 39 స్థానాలకు 38 స్థానాలు గెలిచి క్లీన్‌స్వీప్ చేసిన డీఎంకే కూటమి ఈసారి కూడా సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నది. గత ఎన్నికల్లో చతికిలపడ్డ అన్నా డీఎంకేకు ఈ ఎన్నికలు చావోరేవో అన్నట్టుగా మారాయి. మరోవైపు ఎనిమిది చిన్న పార్టీలను కూడగట్టి మొదటిసారిగా కూటమిని ఏర్పాటు చేసిన బీజేపీ కూడా తమిళనాడుపై చాలానే ఆశలు పెట్టుకున్నది.

**పట్టు నిలుపుకునేందుకు ఇండియా కూటమి యత్నాలు**

గత ఎన్నికల్లో డీఎంకే - కాంగ్రెస్‌తో కూడిన యూపీఏ కూటమి తమిళనాడులోని 39 స్థానాల్లో 38 స్థానాలను దక్కించుకుంది. ఇండియా కూటమిగా బరిలో దిగుతున్న ఇవే పార్టీలు గత ఎన్నికల ఫలితాలనే మళ్లీ సాధించాలని పట్టుదలగా ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ వివక్ష, నీట్ పరీక్షలో తమిళ విద్యార్థులకు అన్యాయం, రాష్ట్రాల హక్కులను కేంద్రం హరించడం, ధరల పెరుగుదల వంటి అంశాలను లేవనెత్తుతూ డీఎంకే ప్రచారం చేస్తున్నది.

**అన్నా డీఎంకేకు జీవన్మరణ సమస్య**

అన్నా డీఎంకేకు ఈ ఎన్నికలు చావోరేవో అన్నట్టుగా మారాయి. జయలలిత మరణం తర్వాతి పరిణామాలు, పార్టీలో చీలికలతో అన్నా డీఎంకే బలహీనపడింది. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో కచ్చితంగా రెండో స్థానంలో నిలవాలని, గౌరవప్రదమైన సీట్లు సాధించి పార్టీ ఉనికిని కాపాడుకోవాలని పళనిస్వామి నేతృత్వంలోని అన్నా డీఎంకే కూటమి గట్టి ప్రయత్నాలనే చేస్తున్నది.

**25 శాతం ఓట్లే బీజేపీ టార్గెట్**

రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయానికి ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు శాయశక్తులా బీజేపీ ప్రయత్నిస్తున్నది. రాష్ట్ర బీజేపీ పగ్గాలు అన్నామలైకి అందించిన తర్వాత ఇక్కడ బీజేపీకి కొంత ఉత్సాహం వచ్చింది. 25 శాతం ఓట్లు సాధించడమే లక్ష్యంగా బీజేపీ బరిలో నిలుస్తున్నది.

### 250 మంది అభ్యర్థులు నేర చరితులే

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఏప్రిల్ 26న జరిగే లోక్‌సభ రెండో విడత ఎన్నికల బరిలో పోటీచేస్తున్న 250 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులున్నాయి. మొత్తం పోటీలో ఉన్న వారిలో 33% మంది కోటీశ్వరులే. మొత్తం 1198 మంది అభ్యర్థుల్లో 1192 అభ్యర్థుల వివరాలు సేకరించగా, అందులో 21% లేదా 250 మందిపై క్రిమినల్ కేసులున్నాయి. ముగ్గురిపై హత్య, 24 మందిపై హత్యాయత్నం కేసులున్నాయి.

### అభిషేక్ బెనర్జీకి పోటీగా అభిజిత్ దాస్

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో డైమండ్ హార్బర్ సిట్టింగ్ ఎంపీ, టీఎంసీ ముఖ్య నేత అభిషేక్ బెనర్జీపై వెటరన్ లీడర్ అభిజిత్ దాస్‌ను బీజేపీ పోటీకి దింపింది. పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర సహాయ మంత్రి సోమ్ ప్రకాశ్‌కు బదులుగా ఆయన భార్య అనితా సోమ్ ప్రకాశ్‌ను ఈసారి బీజేపీ ఎన్నికల బరిలో నిలుపుతున్నది. మహారాష్ట్రలో సతారా నుంచి ఛత్రపతి శివాజీ వారసుడు ఉదయాన్‌రాజే భోసలేను రంగంలోకి దించుతున్నది.



### బృందావనంలో 70 అంతస్తుల ఆలయం

వాషింగ్టన్: యూపీలోని బృందావనంలో 70 అంతస్తుల ఆలయాన్ని నిర్మిస్తున్నారు. 80 మిలియన్ డాలర్లతో నిర్మిస్తున్న బృందావన్ హెరిటేజ్ టవర్ 210 మీటర్లు ఎత్తు ఉంటుంది. ఒకేసారి 3 వేల కార్లు పార్క్ చేసేలా మల్టీలెవల్ పార్కింగ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు.



### 2040 నాటికి ఏటా 10 లక్షల మరణాలు

**రొమ్ము క్యాన్సర్‌పై లాన్సెట్ అధ్యయనం**

*న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: రొమ్ము క్యాన్సర్ కారణంగా 2040 నాటికి ఏటా 10 లక్షల మరణాలు సంభవించే ప్రమాదం ఉన్నదని న్యూ లాన్సెట్ కమిషన్ వెల్లడించింది. 2020 నాటికి గత ఐదేండ్లలో దాదాపు 78 లక్షల మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడగా, అదే ఐదేండ్ల వ్యవధిలో 6,85,000 మంది మరణించారని తెలిపింది. 2020లో దాదాపు 23 లక్షలుగా ఉన్న రొమ్ము క్యాన్సర్ కేసులు 2040 నాటికి 30 లక్షలకు పైగా పెరుగుతాయని, అల్పాదాయ దేశాలపై ఈ వ్యాధి తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. 2040 నాటికి క్యాన్సర్‌తో మరణించే వారి సంఖ్య ఏడాదికి దాదాపు 10 లక్షల వరకు ఉంటుందని పరిశోధకుల బృందం అంచనా వేసింది.*



### పేపర్ బ్యాలెట్ ఓటింగ్‌తో ఏం జరిగిందో మాకు తెలుసు!


**ఈవీఎం-వీవీప్యాట్ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య**

*న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: ఈవీఎంలలో పోలైన ఓట్లను వీవీప్యాట్ స్లిప్పులతో సరిపోల్చాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఎన్నికల ఓటింగ్‌ను తిరిగి పేపర్ బ్యాలెట్ పద్ధతికి తీసుకెళ్లాలన్న పిటిషనర్ ఏడీఆర్ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనపై న్యాయస్థానం ఒకింత అసహనం వ్యక్తం చేసింది. ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్ వినియోగం విషయంలో పలు సమస్యలు ఉన్నాయని పేర్కొన్నది. 'మనం 60 ఏండ్ల వయసులో ఉన్నాం. బ్యాలెట్ పేపర్లు ఉన్న సమయంలో ఏం జరిగిందో మనకందరికీ తెలుసు. మీరు మర్చిపోయినా, మేం మర్చిపోలేదు' అని జస్టిస్ సంజీవ్ ఖన్నా పేర్కొన్నారు. ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ.. పోలింగ్ పారదర్శకంగా ఉండాలంటే పేపల్ బ్యాలెల్ పద్ధతికి తిరిగి వెళ్లాలని లేదా వీవీప్యాట్ యంత్రం గ్లాస్‌ను పారదర్శకంగా ఉండేలా చూడాలని లేదా వీవీప్యాట్ స్లిప్‌ను ఓటర్‌కు ఇచ్చి, దాన్ని బ్యాలెట్ బాక్స్‌లో వేసే పద్ధతికి తీసుకురావాలనే సూచనలు చేశారు. తమ ఓటు రికార్డు అయిందని తెలిపేలా వీవీప్యాట్ ద్వారా వెరిఫై చేసుకోనే సదుపాయం ఓటర్లకు కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని ఏడీఆర్ కోరింది. ఈ కేసుపై తదుపరి విచారణను సుప్రీంకోర్టు గురువారానికి వాయిదా వేసింది.*



### మద్యపానం, ధూమపానంతో 'శుక్రకణం డీఎన్‌ఏ'పై దెబ్బ

*న్యూఢిల్లీ: అనారోగ్యకరమైన జీవన శైలి, దురలవాట్లు.. ఇవన్నీ మగవాళ్లలో శుక్రకణాల డీఎన్‌ఏను దెబ్బతీస్తాయని ఢిల్లీ ఎయిమ్స్ వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ధూమపానం, మద్యపానం, అధికమొత్తంలో ప్రాసెస్డ్ ఫుడ్ తీసుకోవటం వంటివి శుక్రకణాల నాణ్యతను దెబ్బతీస్తాయని తెలిపారు. వంధ్యత్వం, గర్భస్రావాలు, పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు.. శుక్ర కణాల్లో డీఎన్‌ఏ దెబ్బతినటం వల్ల సంభవిస్తాయని వారు గుర్తుచేశారు. గర్భధారణ, పిండం అభివృద్ధిలో తండ్రి పాత్రను విస్మరించలేమని ప్రొఫెసర్ డాక్టర్ రీమా దాదా చెప్పారు. మానసిక ఒత్తిడి గురైనా.. ఆ ప్రభావం స్పెర్మ్‌పై ఉంటుందన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, యోగా చేసే అలవాటుతో మైటోకాండ్రియల్, న్యూక్లియర్ డీఎన్‌ఏల సమగ్రతను పెంచుతుందని ఆమె వివరించారు.*



### మొబైల్ మోసాల కట్టడికి కొత్త వ్యవస్థ

*న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: పెరిగిపోతున్న మొబైల్ మోసాలను కట్టడి చేసేందుకు కొత్త వ్యవస్థ అందుబాటులోకి రానున్నది. కాలింగ్ నేమ్ ప్రజెంటేషన్(సీఎన్‌ఏపీ) సర్వీసును త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్టు కేంద్ర ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు ఎవరు ఫోన్ చేస్తున్నారో వారి నెంబరు మాత్రమే మనకు కనిపించేది. ఈ సర్వీస్ ద్వారా ఫోన్ చేస్తున్న వారి నెంబరుతో పాటు పేరు కూడా డిస్‌ప్లేపై కనిపిస్తుంది. సిమ్ లేదా ఫోన్ కనెక్షన్ తీసుకున్నప్పుడు ఇచ్చే ధ్రువీకరణ పత్రాల ఆధారంగా టెలికం కంపెనీలు పేర్లను డిస్‌ప్లే చేయనున్నాయి. మరోవైపు డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు గానూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నేషనల్ సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ కూడా ఏర్పాటు కానున్నది.*

### అద్దంలో ఓసారి చూసుకోండి

**మోదీకి దీదీ కౌంటర్**

జల్పాయ్‌గురి: తృణమూల్ కాంగ్రెస్‌పై అవినీతి ఆరోపణలు చేస్తున్న ప్రధాని మోదీ మొదట అద్దంలో తనను తాను చూసుకోవాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విమర్శించారు. మంగళవారం ఓ ఎన్నికల సభలో ఆమె మాట్లాడుతూ.. బీజేపీ అంతా దోపిడీదారులతో నిండిపోయిందన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు జరుపుతున్న దర్యాప్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### నా పేరు కేజ్రీవాల్.. నేను ఉగ్రవాది కాదు

**తీహార్ జైలు నుంచి సందేశం**

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తీహార్ జైలు నుంచి ఓ సందేశాన్ని పంపించారు. 'నా పేరు కేజ్రీవాల్, నేను ఉగ్రవాదిని కాను' అని కేజ్రీవాల్ సందేశం పంపారని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. బీజేపీ కక్ష సాధింపు ధోరణితో ఆయనను దెబ్బ తీయాలని ప్రయత్నిస్తున్నదన్నారు. ఓ ఉగ్రవాదితో వ్యవహరించినట్టు కేజ్రీవాల్ పట్ల జైలు అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు.

### మూడో సంపన్న అభ్యర్థిగా హేమామాలిని

న్యూఢిల్లీ: రెండో విడత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో డ్రీమ్ గర్ల్ హేమామాలిని మూడవ అత్యంత సంపన్నురాలిగా నిలిచారు. మథుర నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న హేమామాలిని ఆస్తుల విలువ రూ.278 కోట్లు. కాగా, కర్ణాటకలోని మండ్య కాంగ్రెస్ అభ్యర్థి వెంకట రమణి గౌడ 622 కోట్లు, బెంగళూరు రూరల్ కాంగ్రెస్ అభ్యర్థి డీకే సురేష్ 593 కోట్లతో తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

### కాంగ్రెస్ నేత సూర్జేవాలాపై ఈసీ నిషేధం

న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ హేమమాలినిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రణదీప్ సూర్జేవాలాకు ఈసీ షాక్ ఇచ్చింది. 48 గంటల పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా నిషేధం విధించింది. హర్యానాలో నిర్వహించిన ప్రచారంలో హేమమాలినిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.